ఆరోగ్యశ్రీ సేవలు బంద్

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఈ మేరకు ఆస్పత్రులు యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటికే ఆరోగ్యశ్రీ కింద సేవలు పొందుతున్న వారికి చికిత్సలు కొనసాగిస్తామని, కొత్తగా మాత్రం ఎవరినీ చేర్చుకోబోమని నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రకటించాయి. గడిచిన కొన్ని నెలల నుంచి బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించాయి.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా గదులు

ఓట్ల లెక్కింపు విధులకు 1500 మంది ఉద్యోగులు



(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు కోసం జిల్లా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికలు ముగిసిన తరువాత అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను అనకాపల్లిలో కలెక్టరేట్‌కు సమీపంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన విషయం తెలిసిందే. స్ట్రాంగ్ రూమ్‌కు సమీపంలోనే వచ్చే నెల 4న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభించనున్న ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, అనకాపల్లి పార్లమెంట్‌కు సంబంధించి ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను ఇక్కడ లెక్కించనున్నారు. దీని కోసం ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆరు గదులు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఒక గది, పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్ల లెక్కింపునకు ఆరు గదులు.. మొత్తం 13 గదులను ఓట్ల లెక్కింపునకు అనువుగా ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లతో సిద్ధం చేశారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్లు విశాఖపట్నంలో లెక్కించనున్నారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభంకానుండగా తొలుత పోస్టల్, సర్వీసు ఓట్లను లెక్కిస్తారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా వేర్వేరుగా ఓట్ల లెక్కింపు జరగనుంది. ప్రతి టేబుల్ వద్ద ఒక ఆర్‌వో, ఏఆర్‌వో పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు జరుపుతారు. జిల్లాలో అధికారుల గణాంకాల ప్రకారం హోం ఓటర్లు 1,082 మంది, ఎన్నికల విధుల్లో పాల్గొన్న 12,864 మంది, అత్యవసర సర్వీసుల ఉద్యోగులు 1,468 మంది, త్రివిధ దళాలకు చెందిన సర్వీసు ఓటర్లు 1,051 మంది, ఇతర జిల్లాల నుంచి అందిన పోస్టల్ బ్యాలెట్‌లు 2,909 మంది కలిపి మొత్తం 19,374 ఓట్లను 14 టేబుళ్లపై లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన అర్ధగంట తరువాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు మొదలవుతుందని అధికారులు చెబుతున్నారు.



ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఈవో ముకేశ్‌కుమార్ మీనా, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జేసీ జాహ్నవి, తదితరులు (ఫైల్)

గదిలో ఒక రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఒక ఏఆర్‌వో, గెజిటెడ్ హోదా కలిగిన ఒక కౌంటింగ్ సూపరింటెండెంట్, ఒక సహాయకుడు, ఒక మైక్రో అబ్జర్వర్, ఈవీ ఎంలను అందజేసేందుకు ఇద్దరు వీఆర్‌వోలను నియమించారు. వీరితో పాటు వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్లు లెక్కింపు కేంద్రంలో ఉంటారు. ఉద్యోగులకు ఓట్ల లెక్కింపుపై మాక్ డ్రిల్ చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాట్లు

ఓట్ల లెక్కింపు కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక గదిలో 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి రౌండ్‌కు కనీసం అర్ధగంట సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి రౌండ్‌లో ఆయా నియోజకవర్గానికి చెందిన 14 పోలింగ్ బూత్‌ల ఓట్ల లెక్కింపు జరపనున్నారు. చోడవరం నియోజకవర్గం పరిధిలో 243 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 17 రౌండ్లు పూర్తి లెక్కింపు, 18వ రౌండ్‌లో 5 పోలింగ్ కేంద్రాలకు చెందిన ఓట్లు లెక్కించనున్నారు. మాడుగుల నియోజకవర్గం పరిధిలో మొత్తం 235 పోలింగ్ కేంద్రాలు ఉంటే 14 టేబుళ్లపై 16 రౌండ్లు పూర్తిస్థాయిలో, 17వ రౌండ్‌లో 11 బూత్‌లకు సంబంధించిన ఓట్లను ... మిగతా 8వ పేజీలో

ఓట్ల లెక్కింపునకు 1500 మంది..

ఓట్ల లెక్కింపు విధుల్లో జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 1500 మంది ఉద్యోగులు పాల్గొంటారు. ప్రతి నియోజకవర్గానికి 200 మంది చొప్పున విధుల్లో పాల్గొంటారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు

ఎన్నికల ముందు చకచకా.. తర్వాత పడక



కన్నంపాలెం నుంచి జన్నవరం వరకు పూర్తయిన రోడ్డు నిర్మాణం

చోడవరం- జన్నవరం రహదారి పనులకు మళ్లీ బ్రేక్

- ప్రభుత్వ విప్ ఒత్తిడితో ఎన్నికలకు నెల రోజుల ముందు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్
- పోలింగ్ ముగిసిన తరువాత నిలిపివేత

చోడవరం, మే 22:

ఎన్నికల ముందు పరుగులు పెట్టిన చోడవరం నుంచి బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలను కలిపే చోడవరం- జన్నవరం- కన్నంపాలెం రోడ్డు పనులు ఇప్పుడు నిలిచిపోయాయి. ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో ఎన్నికలపై ప్రభావం చూపుతుందన్న ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఓ కాంట్రాక్టర్‌ను బలవంతంగా ఒప్పించి పనులు ప్రారంభించేలా చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు పనులు ప్రారంభంకాగా కన్నంపాలెం నుంచి జన్నవరం వరకు జోరుగా సాగాయి. ఎన్నికలు ముగిసిన తరువాత మిగతా పనులకు బ్రేక్ పడింది.

మండలంలోని జన్నవరం, చాకిపల్లి, కన్నంపాలెం, తిమ్మనపాలెం, బెన్నవోలు పంచాయతీలతో పాటు బుచ్చెయ్యపేట, రావికమతం, అనకాపల్లి ప్రాంతాలకు కూడా కీలకమైన చోడవరం- జన్నవరం రోడ్డు చాలా ఏళ్లుగా అధ్వానంగా ఉంది. ప్రతిపక్షంలో ఉండగా ధర్మశ్రీ ఈ రహదారిని బాగు చేయాలంటూ పాదయాత్రలు, ఆందోళనలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తరువాత ఈ రోడ్డు పనులకు రూ.2.83 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో తమ కష్టాలు తీరతాయని అందరూ భావించారు. వీటితో పాటు నియోజకవర్గంలోని అంకుపాలెం, లక్ష్మీపురం, రాయపురాజుపేట తదితర రోడ్లకు కూడా కలిపి అధికారులు ప్యాకేజీల కింద టెండర్లు పిలిచారు. ఈ రహదారుల పనులకు పీఆర్ అధికారులు ఏకంగా నాలుగు సార్లు టెండర్లు పిలిచినా, కాంట్రాక్టర్ల నుంచి కనీస స్పందన రాలేదు. దీంతో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ.. కాంట్రాక్టర్లను ఒప్పించి టెండర్లలో పాల్గొనేలా చేశారు. ఈ రోడ్డు పనులు రోలుగుంట మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు దక్కాయి. గత ఏడాది ఆగస్టు నెలలో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు నిధులు లేవని తెలిసి పనులు నిలిపివేశారు.



జన్నవరం జంక్షన్ నుంచి చోడవరం వరకు నిలిచిన రోడ్డు పనులు

ఎన్నికల ముందు హడావిడి

ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో ఎన్నికల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందన్న ఉద్దేశంతో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఓ కాంట్రాక్టర్‌ను ఒప్పించి రోడ్డు పనులు ప్రారంభించారు. ఆ కాంట్రాక్టర్ కన్నంపాలెం నుంచి జన్నవరం జంక్షన్ వరకు పనులు శరవేగంగా చేపట్టారు. ఇదే సమయంలో అటు తిమ్మనపాలెం నుంచి కూడా రోడ్డు వేసుకుని వచ్చారు. ఇక మరో గ్రాంటు కింద బెన్నవోలు నుంచి బుచ్చెయ్యపేట వరకూ తారు రోడ్డు వేసి పనులు పూర్తి చేశారు. అయితే జన్నవరం జంక్షన్ నుంచి పట్టణంలోని కొత్తూరు జంక్షన్ వరకూ ప్రధాన రహదారి పనులను మాత్రం కాంట్రాక్టర్ నిలిపివేశారు. ఎన్నికల ముందు వరకు శరవేగంగా సాగిన పనులు పోలింగ్ తరువాత అర్ధాంతరంగా నిలిచిపోయాయి. జన్నవరం జంక్షన్ నుంచి పీఎస్‌పేట మీదుగా కొత్తూరు జంక్షన్ వరకు సుమారుగా నాలుగు కిలోమీటర్ల మేర ఇంకా రోడ్డు పనులు పూర్తికావలసి ఉంది. రహదారి మధ్యలో కల్వర్టుల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది. అయితే మిగతా పనులు పూర్తవుతాయా? అనే సందేహాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

'జన్మభూమి' 3 గంటలు ఆలస్యం

విశాఖ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే లింక్ తెగిన బోగీలు

- మళ్లీ స్టేషన్‌కు వచ్చిన రైలు.. ప్రత్యామ్నాయం ఏర్పాటుచేశాక ప్రయాణం
- ఇతర రైళ్ల రద్దుతో విపరీతమైన రద్దీ



బుధవారం ఉదయం 9.30 గంటల వరకూ విశాఖ స్టేషన్‌లోనే ఉండిపోయిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం నుంచి లింగంపల్లి వెళ్లాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు (12805) బుధవారం ఉదయం మూడు గంటల ఆలస్యంగా బయలుదేరింది. ఈ రైలును ఉదయం 6.20 గంటలకు సరైన సమయానికే తీసినప్పటికీ స్టేషన్ దాటిన రెండు నిమిషాలకే రెండు బోగీలు (ఎం-1, డీ-1) సాంకేతిక కారణాలతో లింక్‌లు తెగిపోయినట్టు గుర్తించి వెంటనే వెనక్కి తీసుకువచ్చారు. ఆ తరువాత వాటిని మార్చి, వేరే బోగీలను రప్పించి రైలును పంపించేసరికి ఉదయం 9.30 గంటలు అయింది. రైలు వెనక్కి రావడం, స్టేషన్‌లో మూడు గంటలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో నిర్వహణ పనులు జరుగుతున్నాయనే కారణంతో విశాఖపట్నం-విజయవాడల మధ్య అనేక రైళ్లు రద్దు చేశారు. దాంతో ఇక్కడి నుంచి కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారంతా జన్మభూమినే ఆశ్రయిస్తున్నారు. వేసవి సెలవులు కావడం, ఇతర రైళ్లు రద్దు కావడంతో ఈ రైలు కిక్కిరిసిపోయింది. కూర్చొనేందుకు సీట్లు లేకపోవడంతో ప్రయాణికులు ప్రవేశ ద్వారాల వద్ద కూర్చొని వెళ్లారు. రైల్వే అధికారులు స్టేషన్‌లో రద్దీ, కిక్కిరిసిన రైళ్లను చూసైనా సరే అదనపు రైళ్లను నడపడం లేదని, వేసవి సెలవుల దృష్ట్యా కొద్దిరోజులు రైళ్ల రద్దును నిలిపివేయాలని రైలు వినియోగదారుల సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

జగనన్న కాలనీలో రోడ్లు తవ్వేశారు

ఆ మట్టితో బేస్‌మెంట్ల ఫిల్లింగ్

- ఇష్టానుసారంగా వ్యవహరించిన సబ్ కాంట్రాక్టర్
- అధికారుల మొద్దు నిద్ర
- నెల రోజులుగా ఈ వ్యవహారం జరుగుతున్నా పట్టించుకోని వైనం



పైడివాడ అగ్రహారం జగనన్న కాలనీ లేఅవుట్‌లో రోడ్లు తవ్వేసి బేస్‌మెంట్లు ఫిల్లింగ్ చేసిన దృశ్యం

సబ్బవరం, మే 22:

జగనన్న కాలనీలో ఇళ్ల బేస్‌మెంట్ ఫిల్లింగ్‌కు అక్కడి రోడ్లనే తవ్వేసి వినియోగిస్తున్న విచిత్ర పరిస్థితి మండలంలోని పైడివాడ అగ్రహారంలో కనిపించింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సబ్ కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

విశాఖ నగరంలో గల పేదల కోసం వీఎంఆర్‌డీఏ సబ్బవరం మండలం పైడివాడ, పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం గ్రామాల పరిధిలో సుమారు 320 ఎకరాలు సమీకరించి జగనన్న కాలనీలకు లేఅవుట్లు వేసింది. ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు రాక్రీట్ ఇన్‌ఫ్రా సంస్థ కాంట్రాక్ట్ తీసుకుంది. అయితే ఆ సంస్థ గ్రావెల్ లేదా మట్టితో బేస్‌మెంట్ల ... మిగతా 8వ పేజీలో



జగనన్న కాలనీ లేఅవుట్‌లో రోడ్డు

థియేటర్లు వెలవెల



ప్రేక్షకులు లేక వెలవెలబోతున్న విశాఖ నగరంలోని సంగం- శరత్ థియేటర్

వేసవిలోనూ కానరాని ప్రేక్షకులు

- ఐదు శాతం కూడా నమోదుకాని ఆక్యుపెన్సీ
- పెద్ద హీరోల సినిమాలు లేకపోవడం, ఎన్నికలు, ఐపీఎల్ కారణమంటున్న యజమానులు
- మరోవైపు తీవ్రంగా దెబ్బతీస్తున్న ఓటీటీ ప్లాట్‌ఫాం
- తెలంగాణలో ఇప్పటికే సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూత

విశాఖపట్నం, మే 22:

ఒకప్పుడు థియేటర్‌లో సినిమా చూడాలంటే...ఆన్‌లైన్‌లో కనీసం రెండు, మూడు రోజుల ముందు టికెట్లు బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. లేదంటే...షో సమయానికి రెండు, మూడు గంటల ముందుగా క్యూలో నిల్చోవాల్సి వచ్చేది. ఇక వేసవి వచ్చిందంటే చాలు...థియేటర్లకు పండగే. సెలవులు ప్రారంభం నుంచి తిరిగి పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమయ్యే వరకు సినిమాహాళ్లు కిక్కిరిసిపోయేవి. అయితే కాలక్రమేణా ప్రేక్షకులు సినిమా థియేటర్‌లకు దూరమవుతున్నారు. తీవ్రమైన ఒత్తిడితో కూడిన జీవనం, అందుబాటులోకి ఓటీటీ ప్లాట్‌ఫాంలు రావడం తదితర అంశాలు సగటు ప్రేక్షకుడిని థియేటర్‌కు దూరం చేస్తున్నాయి.

ఈ ఏడాది వేసవిలోనూ థియేటర్లు వెలవెలబోతున్నాయి. కనీసం ఐదు శాతం ఆక్యుపెన్సీ కూడా లేకుండానే షోలను ప్రదర్శించాల్సిన దుస్థితిలో యాజమాన్యాలు ఉన్నాయి. వేసవి ఆరంభం నుంచీ ఈ పరిస్థితి కొనసాగడానికి ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికలు, ఐపీఎల్ కారణమని అంచనా వేస్తున్నారు. అదీ కాకుండా పెద్ద హీరోల సినిమాలేవీ విడుదల కాకపోవడం కూడా థియేటర్ల వద్ద జనం కనిపించకపోవడానికి కారణమంటున్నారు. మంచి సినిమా అని టాక్ వచ్చేంత వరకు సినిమా హాళ్లకు ప్రేక్షకులు దూరంగా ఉంటున్నారని, వచ్చిన ఒకటి, రెండు సినిమాలు కూడా అంతగా ఆకట్టుకోకపోవడంతో హాళ్లు నిండని పరిస్థితి నెలకొందంటున్నారు. జనం రాకపోవడంతో తెలంగాణలోని సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఇప్పటికే మూతపడ్డాయని చెబుతున్నారు.

దారుణంగా తగ్గిన ఆక్యుపెన్సీ

ఈ ఏడాది సంక్రాంతి పండగ సమయంలో విడుదలైన పెద్ద సినిమాలు గుంటూరు కారం, డీజే టిల్లు స్క్వేర్, హనుమాన్ బాక్సాఫీసుల వద్ద కనకవర్షం కురిపించాయి. ఆ తరువాత ఆ స్థాయి సినిమాలు విడుదల కాకపోవడం, వచ్చిన చిన్న సినిమాలు ప్రేక్షకుల ఆదరణకు నోచుకోకపోవడంతో థియేటర్‌లు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. సుమారు నాలుగు నెలలుగా రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నది.

సొంతంగా థియేటర్ ఉంటేనే...

విశాఖ పరిసర ప్రాంతాల్లో కొందరికి సొంతంగా థియేటర్‌లు ఉన్నాయి. దీంతో వారు అందులో పనిచేస్తున్న సిబ్బంది ... మిగతా 8వ పేజీలో

బడి బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

- 12వ తేదీ వరకు అవకాశం
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుంటే కఠిన చర్యలు
- ఆర్టీవో వెంకట్రావు



స్కూల్ బస్సును పరిశీలిస్తున్న ఆర్టీవో వెంకట్రావు

నర్సీపట్నం, మే 22: వచ్చే నెలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు దూర ప్రాంతంలో ఉన్న విద్యార్థుల అడ్మిషన్లు ఆకర్షించడానికి బస్సు సౌకర్యం కల్పిస్తుంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ బస్సు కండీషన్ గురించి పట్టించుకోరు. స్కూల్ ఫీజుతో కలిపి బస్సుకి డబ్బులు కట్టి స్కూల్‌కి పంపుతుంటారు. బడి బస్సు కండీషన్ బాగోలేకపోతే అనేక సందర్భాలలో ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి జూన్ 12 వరకు స్కూల్ బస్సులకు ఫిట్ నెస్ పరీక్షలు చేసి సర్టిఫికెట్లు జారీ చేయడానికి ఆర్టీవో అధికారులు అవకాశం ఇచ్చారు. బస్సు ఆర్టీవో కార్యాలయానికి తీసుకు వస్తే పరీక్షలు చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. స్కూళ్లు తెరిచిన తరువాత బస్సులో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. నర్సీపట్నం ఆర్టీవో కార్యాలయం పరిధిలోని 12 మండలాల్లో సుమారు 110 బడి బస్సులు ఉన్నాయి. గత వారం రోజుల్లో 50 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించినట్టు ఆర్టీవో వెంకట్రావు తెలిపారు. త్వరగా మిగిలిన బస్సులకు కూడా ఫిట్‌నెస్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎలమంచిలి, మే 22: మండలంలోని లక్కవరం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి రూరల్ ఎస్ఐ సింహాచలం అందించిన వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లి మండలం దోసలపాడు గ్రామానికి చెందిన పల్లా లక్ష్మణరావు(42), ముకుందరాజు పేట గ్రామానికి చెందిన కొర్ని రమణ ద్విచక్ర వాహనంపై, డొంకాడకు చెందిన ఉద్దండం గిరీష్, కాపారపు నాగేంద్ర ఇద్దరూ కలిసి మరో బైక్‌పై గాజువాక తాపీ పని నిమిత్తం బయలుదేరారు. లక్కవరం జంక్షన్ వద్ద లారీని తప్పించే క్రమంలో కొర్ని రమణ బైక్ ముందుగా వెళుతున్న బైక్‌ను ఢీకొట్టడంతో రెండు బైక్‌లపై ప్రయాణిస్తున్న పల్లా లక్ష్మణరావు, ఉద్దండం గిరీష్ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఇద్దరిని అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మణరావు మృతి చెందగా, గిరీష్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించినట్టు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉందని ఎస్ఐ సింహాచలం తెలిపారు.

బైక్ ఢీకొని సైక్లిస్టు దుర్మరణం

కోటవురట్ల, మే 22: మండలంలోని యండపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్టు కోటవురట్ల ఎస్ఐ రమణయ్య తెలిపారు. మండలంలోని యండపల్లి గ్రామానికి చెందిన గుడివాడ అప్పలనాయుడు (46) బుధవారం ఇంటి నుంచి పశువుపాకల వద్ద వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని సైకిల్‌పై తిరిగి ఇంటికి వస్తూ యండపల్లి జంక్షన్ వద్ద రోడ్డుదాటుతుండగా వెనుక నుంచి సన్యాసిరాజుపాలెం గ్రామానికి చెందిన గెంజి కన్నబాబు బైక్‌పై వేగంగా వచ్చి సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అప్పలనాయుడు సైకిల్ మీదనుంచి రోడ్డుపై చాలాదూరంగా వెళ్లి పడిపోయాడు. అతనికి తల వెనుక భాగంలో బలంగా గాయమైంది. ముక్కు, చెవినుంచి రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో అతని భార్య అప్పియ్యమ్మ అక్కడే ఉండడం గమనార్హం. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమణయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కోటవురట్ల 50 పడకల ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

కశింకోట, మే 22 : మండలంలోని తీడ గ్రామ సమీపంలో ఏలేరు కాలువలో మృతదేహం లభ్యమైందని సీఐ వినోద్‌బాబు తెలిపారు. మాకవరపాలెం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన రాజాన మల్లేశ్వరరావు (44) బహిర్భూమి నిమిత్తం మంగళవారం సాయంత్రం ఏలేరు కాలువ గట్టుపైకి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడిపోయాడు. గురువారం ఉదయం 11 గంటలకు తీడ గ్రామ శివారున ఉన్న ఏలేరు కాలువలో మృతదేహం బయటపడిందని సీఐ తెలిపారు. మృతుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మల్లేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పెదబొడ్డేపల్లిలో యువకుడిపై హత్యాయత్నం

▸ ఆరుగురి అరెస్టు

నర్సీపట్నం, మే 22: పెదబొడ్డేపల్లికి చెందిన యువకుడిపై జరిగిన హత్యాయత్నం కేసులో పట్టణ పోలీసులు ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్ఐ సుధాకరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి పెదబొడ్డేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పొన్నపు కుమార్‌పై అదే కాలనీకి చెందిన జల్లూరి రాజా ఉరఫ్ ఏసు, జల్లూరి రాజు, జల్లూరి లోవరాజు, జల్లూరి కిషోర్ కుమార్, జల్లూరి చిన్నా, సీరం అజయ్‌కుమార్‌లు కత్తులతో దాడి చేసి కడుపు, చేతి మీద తీవ్రంగా గాయ పరిచారు. 2019లో జరిగిన హత్యాయత్నం కేసులో రాజీ పడడానికి ఇరువురు మాట్లాడుకున్న తరువాత రాజీ పడకపోవడంతో ఘర్షణకు దారి తీసింది. ఇందులో మధ్యవర్తిగా వ్యవహరించిన జల్లూరి ఏసు, పొన్నపు కుమార్‌ల మధ్య ప్రధానంగా గొడవ జరిగింది. దీంతో ఏసుతో కలిసి మిగతా ఐదుగురు కుమార్‌పై దాడి చేశారని ఎస్ఐ తెలిపారు. బాధితుడు కుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు.

ట్రాక్టర్ విడి భాగాలు చోరీ

రోలుగుంట, మే 22: మండలంలోని నిండుగొండ జంక్షన్ వద్ద ఉన్న రాజమండ్రి వారి క్రషర్ వద్ద వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి సంబంధించి బాధితుడు బనికెల దేముడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి.. దేముడు ట్రాక్టర్లను ఎప్పటిలాగే మంగళవారం రాత్రి రాజమండ్రి వారి క్రషర్ వద్ద ఉంచి ఇంటికి వచ్చేశాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్‌కు చెందిన హెడ్ లైట్సు, ఫ్యాన్, బ్యాటరీ ఇతర విలువైన సామగ్రిని తొలగించి గుర్తుతెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. రెండు నెలల క్రితం ట్రాక్టర్ నాగలిసెట్, బ్యాటరీలు, డీజిల్‌ను దొంగలించుకుపోయినట్టు పేర్కొన్నాడు. వీటి విలువ రూ. లక్షల్లో ఉంటుందని తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సురేష్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడినుంచివివరాలు సేకరించారు. పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలను కూడా పరిశీలించారు.

గర్సింగిలో గిరి నాగు

దేవరాపల్లి, మే 22: మండలంలోని గర్సింగి గ్రామంలో రంసాల ఈశ్వరరావు ఇంటి సమీపంలో గిరినాగు హల్‌చల్ చేసింది. దీనిని గ్రామస్తులు హతమార్చారు. బుధవారం ఉదయం పెరటినుంచి ఇంట్లో చొరబడుతుండగా ఈ పామును చూశారు. కొంత సేపు పరుగులు పెట్టించింది చివరకు దానిని స్థానికులు హతమార్చారు. దీంతో పరిసర నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు.


గర్సింగిలో హతమార్చిన గిరి నాగు

ఒకే చెట్టుకు 12 రకాల మామిడి కాయలు

పద్మనాభం, మే 22: విశాఖ జిల్లా పద్మనాభం మండలం బాందేవుపురం గ్రామంలో మాజీ సర్పంచ్ సాగి కృష్ణమూర్తిరాజు ఇంటి పెరటిలో ఉన్న మామిడి చెట్టుకు 12 రకాల కాయలు కాశాయి. రైతు అయిన ఆయన తన పొలాల్లో పలు రకాల మామిడి చెట్లు పెంచుతున్నారు. ఒకే చెట్టుకు అంటు కట్టే విధానంలో పలు రకాల మామిడి కాయలు కాచేవిధంగా చేస్తే ఎలా ఉంటుందని ఆలోచించి, 12 ఏళ్ల క్రితం తన ఇంటి ఆవరణలో పరియా మామిడి మొక్క వేశారు. ఆ మొక్కకు ఏడేళ్ల క్రితం ఏకంగా 12 రకాల అంట్లు కట్టించారు. ఈ విధంగా కట్టించిన అంట్లు సత్ఫలితాలు ఇవ్వడంతో ఆ చెట్టుకు పన్నూరు మామిడి, ఇమాపసంద్, చెరుకు రసాలు, సువర్ణ కలశ, బంగినపల్లి, దొండకాయ, సువర్ణరేఖ, కొత్తపల్లి కొబ్బరి, దశేరి తదితర రకాల కాయలు కాస్తున్నాయి. తన ఇంట్లో వినియోగించుకోవడానికి ఈ చెట్టుకు ఈ విధంగా అంట్లు కట్టించినట్టు రైతు కృష్ణమూర్తిరాజు తెలిపారు.


పన్నెండు రకాల కాయలు కలిగిన మామిడి చెట్టు

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	133.00
లైవ్ ధర	153.00
విత్ స్కిన్	276.00
స్కిన్ లెస్	286.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

లక్షలు వృథా.. లక్ష్యానికి చెద..!

▸ బుచ్చెయ్యపేటలో అసంపూర్తిగా పలు శాఖల భవనాలు

▸ పట్టించుకోని అధికారులు

▸ ఇబ్బందుల నడుమ సిబ్బంది విధులు

కొందరు అధికారుల తీరు చాలా విచిత్రంగా ఉంటుంది. ఆయా శాఖలకు చెందిన భవన నిర్మాణాలు ఏళ్లతరబడి అసంపూర్తిగా నిలిచిపోయి, అద్దె భవనాల్లో కొనసాగుతున్నా పట్టడం లేదు. కొద్దిపాటి నిధులు వెచ్చించి వాటిని పూర్తి చేసి, తద్వారా అద్దె డబ్బులు సర్కారు ఖజానాకు మిగుల్చుదామన్న కనీస ఆలోచన చేయలేకపోతున్నారు. ఫలితంగా ఇరుకు గదుల్లో.. ఇబ్బందుల నడుమ సిబ్బంది విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.


వి.కొత్తూరులో అర్ధంతరంగా నిలిచిన ఆర్‌బీకే భవన నిర్మాణం

బుచ్చెయ్యపేట, మే 22: మండలంలోని ఏకైక మేజర్ పంచాయతీ వడ్డాదిలో పలు ప్రభుత్వ భవనాలు ఏళ్ల తరబడి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ఆయా శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఆరు కేంద్రాలకు పక్కా భవనాల నిమిత్తం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.80 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో దొరబాబు కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రం భవనం పూర్తికావడంతో సదరు భవనంలో ఆ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. మిగిలిన వడ్డాది-కొత్తూరులో వడ్డాది-1 ,2, పాత హైస్కూల్ వద్ద వడ్డాది -5, గొల్లవీధిలో వడ్డాది-7 అంగన్‌వాడీ భవనాల శ్లాబ్ పనులు మూడేళ్ల క్రితమే పూర్తి చేశారు. పెద్ద బజారు వీధిలోని వడ్డాది-3 కేంద్రం భవనం పనులు శ్లాబ్ స్థాయికి చేరుకున్నాయి. అప్పటి నుంచి మిగిలిన పనులు ముందుకు సాగడం లేదు. ఇదిలా వుంటే, ఆదత్రాపు వీధిలో కచ్చీరాళ్ల వద్ద సామాజిక భవనానికి సంబంధించిన పనులు పదిహేను సంవత్సరాల క్రితం శ్లాబ్ అనంతరం నిలిచిపోయాయి. అలాగే, వడ్డాది-కొత్తూరులో రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ పనులు గత నాలుగేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. వీటిని చూసినవారు ఇలా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేయడం తగునా అంటూ- ప్రశ్నిస్తున్నారు. అరకొర సౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో ఆయా శాఖలను కొనసాగించే బదులు.. కాస్త నిధులు వెచ్చించి అర్ధంతరంగా నిలిచిన భవనాలను పూర్తి చేయాలన్న ఆలోచన అధికారుల్లో లేకపోవడం ఏమిటని పలువురు వాపోతున్నారు. దీనిపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా అంతా కోరుతున్నారు.


వడ్డాది-కొత్తూరులో అంగన్‌వాడీ భవనం దుస్థితి


వడ్డాదిలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం-6

వారం రోజులుగా రాని కొళాయిలు

▸ మూడు వీధులకు తప్పని అవస్థలు

▸ మోటారు పాడైనా స్పందించని మునిసిపల్ అధికారులు

తాగునీటి కోసం పట్టణ వాసులు ఇక్కట్లు

ఎలమంచిలి, మే 22: వారం రోజులుగా కొళాయిల నుంచి తాగు నీరు రాకపోవడంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము కష్టాలు పడుతున్నామని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం మునిసిపల్ అధికారులు పట్టించుకోలేదు. మునిసిపాలిటీలోని వీరభద్రస్వామి ఆలయం ప్రాంతం, కాకివానివీధి, రామచంద్రమ్మ అమ్మవారి ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేసే మోటారు వారం రోజుల క్రితం మరమ్మతుకు గురైంది. అయినా మునిసిపల్ అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. దీంతో ఆ ప్రాంతాల ప్రజలు చేతిబోర్లను, ఆర్వో ప్లాంట్‌లను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఈ ప్రాంతాల్లోని ప్రజలకు రెండు ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీటిని సరఫరా చేస్తున్నారని ఆయా ప్రాంతాల వారు ఆరోపిస్తున్నారు. వారం రోజుల క్రితం మోటారు మరమ్మతులకు గురైనా ఇంతవరకు బాగు చేయకపోవడం ఏమిటని వారంటున్నారు. వేసవిలోనే అధికారుల తీరు ఉంటే మిగతా సమయాల్లో మా పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రతీ రోజూ ట్యాంకర్ కోసం ఎదురు చూడాల్సి వస్తుందని వీరభద్రస్వామి ఆలయం ప్రాంత ప్రజలు వాపోతున్నారు. కాకివానివీధిలోని కొళాయిలు రోజు తప్పించి రోజు ఇస్తున్నారని, అది కూడా పూర్తిగా ఇవ్వడం లేదని మహిళలు వాపోతున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పేద, మధ్య తరగతి ప్రజలు నివాసం ఉండే మాలాంటి ప్రాంతాల్లోని ప్రజలకు పూర్తిస్థాయిలో కొళాయిల నుంచి నీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు. వేసవిలో ప్రజల తాగునీటి ఇబ్బందులను గుర్తించి త్వరితగతిన మోటారు మరమ్మతు పనులు చేయించి సత్వరం తాగునీటి కొళాయిలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.


కాకివానివీధిలో చుక్కరాల్చని తాగునీటి కొళాయి


వీరభద్రస్వామి ఆలయం వీధిలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న స్థానికులు

ఇసుక తవ్వకాలపై కదిలిన అధికార యంత్రాంగం

▸ చిక్కుడుపాలెంలో తవ్వకాలను పరిశీలించిన మైనింగ్, రెవెన్యూ, నీటిపారుదల అధికారులు

▸ రాత్రి ఏడు గంటల తర్వాత తవ్వకాలు జరుగుతున్నట్టు చెప్పిన స్థానికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాతవరం, మే 22: మండలంలోని చిక్కుడుపాలెం వద్ద తాండవనదిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను నర్సీపట్నం మైనింగ్ అధికారి కె. హరకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. మండలంలో 'ఇసుకాసురుల ఇష్టారాజ్యం' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. బుధవారం తాండవ నదిలోని ఇన్‌ఫిల్టర్ వెల్ వద్ద వెళ్లి పరిశీలించారు. అక్కడకు చేరిన స్థానికులు మాట్లాడుతూ రాత్రి 7 గంటల దాటిన తర్వాత ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్టు తెలిపారు. అలాగే పగటి వేళలలో ఎడ్లబండ్లు ద్వారా ఇసుక రవాణా జరుగుతున్నట్టు తెలిపారు. దీనికి స్పందించి మైనింగ్ అధికారి హరకుమార్‌నాయుడు మాట్లాడుతూ తాండవ నదిలో ఎక్కడైనా ఇసుక తవ్వకాలు జరిగితే తన దృష్టికి తీసుకురావాలని, లేకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు. రెవెన్యూ అధికారులు కూడా తాండవ నదిలో ఇసుక తవ్వకాలపై నిఘా పెట్టాలని హరకుమార్‌నాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రహీమన్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.


చిక్కుడుపాలెంలో ఇసుక తవ్వకాలు పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా వాసవీమాత విగ్రహ ప్రతిష్ఠ శత జయంతి వేడుకలు

అనకాపల్లి టౌన్, మే 22: పట్టణంలోని ప్రసిద్ధి చెందిన కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వాసవీమాత విగ్రహ ప్రతిష్ఠ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున అమ్మవారి ఉత్సవమూర్తితో భక్తులు నగర సంకీర్తన చేపట్టారు. ఆలయంలో గోపూజలు, ప్రదక్షిణాలు, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. రేజేటి రామానచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో అమ్మవారికి శాంతి హోమం నిర్వహించారు. శంకరాచార్య సౌందర్య లహరి హైదరాబాద్ వారి కొండూరి పద్మావతి ఉపన్యాసం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి వాసవీమాతను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంథి శేషకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉత్సవమూర్తితో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

నేడు అప్పన్నకు రెండో విడత చందనం సమర్పణ

సింహాచలం, మే 22 : వరాహలక్ష్మీనృసింహస్వామికి గురువారం రెండో విడత చందనం సమర్పించనున్నారు. ఈనెల 18 నుంచి నాలుగు రోజుల పాటు ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది శ్రమించి అరగదీసిన చందనపు ముద్దలో బుధవారం 32 రకాల సుగంధ ద్రవ్యాల చూర్ణాలను మిళితం చేసి పద్మనిధిలో భద్రపరిచారు. దాన్ని గురువారం వేకువజామున సుప్రభాత సేవ తరువాత అర్చకులు స్వామివారికి పైపూతగా సమర్పించనున్నారు. ఎప్పటిలానే ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మత్స్యకారులు బుధవారం రాత్రి నుండే సింహాచలం వచ్చి వరాహ పుష్కరిణిలో స్నానాలు చేసి కోలలకు పూజలు చేసిన అనంతరం వంటా వార్పు చేసి ప్రసాదాలు స్వీకరించారు. కాగా భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ఈఓ శ్రీనివాసమూర్తి ముందస్తుగా అంచనా వేసి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు.

రద్దీ వేళ రైళ్ల రద్దు తగదు

▸ కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ

అనకాపల్లి టౌన్, మే 22: ప్రయాణికులతో రద్దీగా నడిచే సమయంలో రైళ్ల రద్దు తగదని కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. ఏడాది నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతుందని, దీనిపై సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. నిర్వహణ పనుల పేరుతో ఎక్కువ సంఖ్యలో రైళ్లను తరచూ రద్దు చేయడంతో రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు రైల్వే బోర్డుకు లేఖను పంపినట్టు తెలిపారు. అత్యాధునిక వ్యవస్థ కలిగిన రైల్వే శాఖ ఏడాదిగా నిర్వహణ, ఆధునీకీకరణ పనుల పేరుతో డిమాండ్ ఉన్న రైళ్లను రద్దు చేస్తుందని, సీజన్, ప్రయాణికుల రద్దీని పరిగణనలోకి తీసుకోకుండా రైళ్ల రద్దు, దారి మళ్లింపు చేస్తుందన్నారు. రైల్వే ప్రయాణికుల హక్కులను కాలరాసే విధంగా రైల్వే అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏ పనికైనా రైల్వే సిటిజన్ చార్టర్ ప్రకారం నిర్దేశిత గడువు ఉంటుందని, దానిని తోసిపుచ్చి ఏడాది పొడవునా రైల్వే ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నారని దుయ్యబట్టారు. గుంటూరు నుంచి విశాఖ మధ్య నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, వ్యాపారులు పలు ప్రాంతాలకు వెళ్తుంటారన్నారు. ఇటువంటి రైలును కొంతకాలంగా నిర్వహణ పనుల పేరుతో రద్దు చేయడం విచారకరమన్నారు. అలాగే రాయగడ పాసింజర్ రైలును రద్దు చేయడం కూడా విచారకరమన్నారు. తక్షణమే ప్రయాణికుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రైళ్లను పునరుద్ధరించాలని కోరారు.

ఎండతో జనం బెంబేలు

▸ నిర్మానుష్యంగా మారిన రహదారులు


నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న పరవాడ సంతబయలు

పరవాడ, మే 22: మండల కేంద్రంలో బుధవారం భానుడు నిప్పులు చెరిగాడు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఎండ వేడి ధాటికి ఉదయం 11 గంటలకల్లా ప్రధాన రహదారులు నిర్మానుష్యమయ్యాయి. ఎండకు తోడు వేడిగాలులు వీయడంతో వృద్ధులు, చిన్న పిల్లలు అల్లాడిపోయారు. మూడు రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీని కారణంగా నిత్యం రద్దీగా ఉండే పరవాడ సంతబయలు ఎండ కారణంగా బోసిపోయింది. సంతబయలు వద్ద నిర్మానుష్య వాతావరణం నెలకొంది.

నక్కపల్లి : వారం రోజుల నుంచి సూరీడు నిప్పులు చెరుగుతున్నాడు. ఉదయం 6 గంటల నుంచే భానుడి ఉగ్రరూపం దాలుస్తున్నాడు. ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. రహదారులన్నీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్మానుష్యంగా కనపడుతున్నాయి. గత మూడు రోజుల నుంచి నక్కపల్లి ప్రాంతంలో సగటున 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. నైరుతీ రుతుపవనాల ఆగమనం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

కౌంటింగ్‌కు ముందు, తర్వాత శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు

▸ ఆర్‌వో జయరాం, డీఎస్పీ మోహన్

నర్సీపట్నం, మే 22 : ఎన్నికల కౌంటింగ్‌కు ముందు, తర్వాత శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీవో జయరాం అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలింగ్ తర్వాత, ముందు తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా అల్లర్లు, గొడవలకు దిగితే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మోహన్ అన్నారు. పోలీస్ చట్టం-30, 144 సెక్షన్, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిషేధాజ్ఞలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు.


డీఎస్పీ మోహన్‌తో ఆర్‌వో జయరాం సమావేశం

బీబీపట్నం పూర్వ హెచ్‌ఎం బాబ్జీరావు సస్పెన్షన్

▸ 'నాడు-నేడు' నిధుల అవకతవకలపై వేటు

రోలుగుంట, మే 22: మండలంలోని బీబీపట్నం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బాబ్జీరావు సస్పెండ్ చేస్తూ ఆర్‌జేడీ విజయభాస్కర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంఈఓ-1 జాన్ ప్రసాద్ తెలిపారు. ఈపాఠశాలలో 160 మంది విద్యార్థులు ఉన్నారు. నాడు-నేడు రెండో విడత కింద రూ.61లక్షలు నిధులు మంజూరయ్యాయి. విద్యాకమిటీ తీర్మానంతో పనులు చేపట్టాల్సి ఉన్నా, ఇదేమీ లేకుండానే పనులు చేపట్టారు. విద్యా కమిటీ చైర్మన్ సంతకాలతో నిధులను డ్రా చేయాల్సి ఉంది. కానీ కమిటీ చైర్మన్‌తో ముందుగానే 13 ఖాళీ చెక్‌లపై సంతకాలు చేయించుకుని పనులు పూర్తికాకుండానే సుమారు రూ.42లక్షల నిధులను డ్రా చేశారు. గత ఏడాది జూన్‌లో హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియలో భాగంగా బాబ్జీరావు మాకవారపాలెం మండలం గిడుతూరు పాఠశాలకు బదిలీ అయ్యారు. బీబీపట్నంకు నక్కపల్లి నుంచి నట్టి అప్పారావు హెచ్‌ఎంగా వచ్చారు. బాబ్జీరావు బాధ్యతలు అప్పగించే సమయంలో నాడు -నేడు పనుల్లో డ్రా చేసిన నిధులకు చేసిన పనులకు పొంతన లేకపోవడంతో ప్రస్తుతం హెచ్‌ఎం అప్పట్లోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఈఓ గత ఏడాది నవంబరులో విచారణకు ఆదేశించడంతో బీబీపట్నం హైస్కూల్‌లో విచారణ చేపట్టి నివేదిక అందించారు. దీని ఆధారంగా హెచ్‌ఎం బాబ్జీ రావును ఆర్జేడీ సస్పెండ్‌చేశారు.


మధ్యలోనే నిలిచిపోయిన పనులు

కొత్తూరు పంచాయతీలో అవకతవకలపై విచారణ

▸ లోకాయుక్తకు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు

▸ విచారణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన ఫిర్యాదుదారుడు


విచారణ జరుపుతున్న నర్సీపట్నం డీఎల్‌పీవో మూర్తి

కొత్తూరు, మే 22 : కొత్తూరు మేజర్ పంచాయతీలో జరిగిన ఆక్రమణలు, అవకతవకలపై లోకాయుక్తకు సమాచార హక్కు చట్టం కార్యకర్త చింతా గోపీ పలు ఆధారాలతో 2023లో ఫిర్యాదు చేశారు. దీనిపై అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణికి లోకాయుక్త విచారణ నిమిత్తం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆమె నర్సీపట్నం డీఎల్‌పీవో ఎస్ఎస్ఎస్ఎన్‌మూర్తికి విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం ఆయన కొత్తూరు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ముందుగా దొంగగెడ్డ ఉన్న ఇరుపక్కల పరిసర ప్రాంతాలు ఆక్రమణకు గురైన అంశాలను పరిశీలించారు. ముత్రాసు కాలనీ ప్రాథమిక పాఠశాల వెనుక భాగంలో ఆక్రమించి బహుళ అంతస్తులు నిర్మించిన భవనాలను పరిశీలించారు. కొత్తూరు పంచాయతీ కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న 28 ఎకరాల ఎర్రచెరువును ఆక్రమణ గురైందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వీటన్నింటికీ అప్పట్లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన యు. రమాకుమారి ఎటువంటి నిబంధనలు పాటించకుండా అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారని ఫిర్యాదు అందిందని చెప్పారు. వీటన్నింటిపై విచారణ చేపట్టి డీపీవో శిరీషారాణికి నివేదిస్తామని మూర్తి తెలిపారు. కాగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై డీఎల్‌పీవో తూతూమంత్రంగా విచారణ చేపట్టడం అన్యాయమని సమాచార హక్కు చట్టం కార్యకర్త చింతా గోపీ అన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లోకాయుక్తలో న్యాయం జరగకపోతే హైకోర్టు బెంచ్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

శ్రీధర్‌కు రాష్ట్ర జీవ వైవిధ్య సంరక్షణ అవార్డు



అవార్డు అందుకుంటున్న కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్

తుమ్మపాల, మే 22 : ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా అనకాపల్లి పట్టణానికి చెందిన కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్ జీవవైవిధ్య సంరక్షణ అవార్డును అందుకున్నారు. ఏపీ జీవ వైవిధ్య మండలి, జాతీయ జీవవైవిధ్య అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం విశాఖలో జరిగిన కార్యక్రమంలో కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్‌కు ఈ అవార్డును ఐఎఫ్ఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి అందజేశారు. గత 22 ఏళ్లగా శ్రీధర్ జీవ వైవిధ్య సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధానంగా విత్తన బంతుల తయారీ, పిచ్చుకల సంరక్షణ, ఔషధ మొక్కల ఏర్పాటు తదితర కార్యక్రమాలను చేపడుతున్నారు.

'పాయకరావుపేట'కు 14 టేబుళ్లు.. 22 రౌండ్లు

» రిటర్నింగ్ ఆఫీసర్ గీతాంజలి

నక్కపల్లి, మే 22: పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్ల ఏర్పాటు చేస్తున్నామని, 22 రౌండ్లు లెక్కింపు వుంటుందని రిటర్నింగ్ ఆఫీసర్ కె.గీతాంజలి చెప్పారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్లతో కలిపి మొత్తం 22 రౌండ్లు వుంటాయని చెప్పారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ కోసం రెండు టేబుళ్ల ఏర్పాటు చేస్తామన్నారు. లేదా 500 ఓట్లకు ఒక టేబుల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో 2,111 పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు పోలైనట్టు ఆమె చెప్పారు. నియోజకవర్గంలో 2,50,744 ఓట్లు వుండగా, 2,06,626 ఓట్లు పోలైనట్టు చెప్పారు. 292 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 14 టేబుళ్లు, 22 రౌండ్లలో లెక్కింపు వుంటుందని చెప్పారు.

చెత్తను తొలగించిన అధికారులు

పాయకరావుపేట రూరల్, మే22: మండలంలోని పెద రాంభద్రపురంలో 'రోడ్డుపైనే చెత్తా చెదారం' అనే శీర్షికన ఈనెల 16న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆ రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించామని పంచాయతీ కార్యదర్శి రామగోవిందు తెలిపారు. .

టీడీపీ నాయకుల పరామర్శ

పాయకరావుపేట రూరల్ 22: మండలంలోని గోపాలపట్నం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కోనేటి వెంకట పాపారావును టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు బుధవారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం వెంకటపాపారావు కుమారుడు మృతి చెందాడు. ఈ సందర్భంగా బుధవారం పాపారావును పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెరిరెడ్డి శ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, గణపర్తి దొర, కోనేటి చంద్రమౌళి, కోనే కొండబాబు, దువ్వ శ్రీనివాస్, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రామచంద్రమ్మ అమ్మవారి సారె ఊరేగింపు

ఎలమంచిలి, మే 22: పట్టణ ప్రజల ఆరాధ్యదైవం శ్రీ రామచంద్రమ్మ అమ్మవారి జాతర పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఆలయం నుంచి సారె ఊరేగింపు జరుగుతోంది. ఈ నెల 30 వ తేదీన అమ్మవారి పండుగ నిర్వహణకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం నుంచి పురవీధుల్లో సారె ఊరేగిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

వెంకటేష్ అభిమాని కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అభిమానులు

అనకాపల్లి టౌన్, మే 22: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విశాఖపట్నం కొమ్మాదికి చెందిన సినీనటుడు వెంకటేష్ అభిమాని గుమ్మడి మధు కుటుంబానికి ఏపీ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ బృంద సభ్యులు బుధవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. వెంకటేష్ అభిమాన సంఘం అధ్యక్షుడు గుమ్మడి మధు ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి మృతి చెందడం అభిమానులందరూ జీర్ణించుకోలేకపోయామని హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు పి.చందు పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి తన వంతుగా రూ.45వేలు అందజేశామని ఆయన తెలిపారు. మధు కుటుంబాన్ని ఆదుకోవడానికి పలు అభిమాన సంఘాలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అభిమానులు రాంబాబు, ఒంపోలు రాయి వెంకటరమణ, పి. అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ

పాయకరావుపేట, మే 22 : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు యోగాసనాలు, దేశభక్తి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. బుధవారం రాజా రామ్మోహన్‌రాయ్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామయ్య విద్యార్థులకు దేశభక్తి, వందేమాతరం విశిష్టత, రాజారామ్మోహన్‌రాయ్ జీవిత చరిత్రను వివరించారు. ఎ.అచ్యుతరావు విద్యార్థులతో రామాయణం, సుందరకాండ, భగవద్గీత శ్లోకాలను చదివించారు. అదేవిధంగా ఎన్‌టీ.సీతారామమూర్తి విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈదటంలో దాహం కేకలు

» రెండు నెలలుగా తాగునీటికి గ్రామస్థులు అవస్థలు » కొళాయి కనెక్షన్లు ఇచ్చినా గుక్కెడు నీరు రాని వైనం

» నీటి కోసం మహిళలు, వృద్ధులు పాట్లు » పట్టించుకోని పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు


ఈదటంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పాయకరావుపేటరూరల్, మే 22 : మండలంలోని ఈదటం గ్రామంలో తాగునీటికి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుక్కెడు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. తాగునీటిని వేరే చోటికి వెళ్లి మహిళలు బిందెలు, బాటిళ్లతో తెచ్చుకుంటున్నారు. గ్రామంలో శెట్టి బలిజ వీధి, బ్రహ్మల వీధి తదితర ప్రాంతాలలో రెండు నెలలుగా కొళాయిలు సక్రమంగా రావడం లేదని పిల్లి లక్ష్మి, కోట నాగయ్యమ్మ, పోలారపు లక్ష్మి, పోలారపు గోవిందమ్మ, కోట భవానీ, కోట లోవలక్ష్మి, పెంకే మంగ, గోకాడ లోవలక్ష్మి, పోలారపు నేరితల్లి, కోట సింహాచలం తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కొళాయిలలో కొద్దిగా నీరు వచ్చేదని, జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కొళాయిలు వేసిన తరువాత అసలు నీరు రావడం లేదని వారు వాపోయారు. కొన్ని నెలలుగా గ్రామంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదటం గ్రామం నుంచి పాల్మన్‌పేటకు తాగునీరు సరఫరా అవుతుంది గానీ గ్రామంలో మాత్రం తాగునీరు సక్రమంగా అందివ్వడం లేదని జనసేన నాయకుడు కాశపు గోవిందు విమర్శించారు. గ్రామంలో ఏడు బోర్లు ఉన్నాయి. వాటిని పైపులైనుకు డైరక్టుగా కలిపారు. అయితే కొన్ని ప్రాంతాలకు నీరు అందుతుంది. కొన్ని ప్రాంతాలకు నీరు అందడం లేదు. జలజీవన్ మిషన్‌లో వాటర్ ట్యాంకు మంజూరయినా నేటి వరకు పనులను ప్రారంభించలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పైపులైన్లు వేసి ఇంటింటి కొళాయి కనెక్షన్లు ఇచ్చారు గానీ వాటిలో నీరు వస్తుందో లేదో చూడలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుని మంచినీరు ఇప్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రెండు నెలలు అవుతున్నా పట్టించుకోలేదు

పోలారపు నేరితల్లి, ఈదటం



కొళాయిలు రెండు నెలలుగా రావడం లేదు. పనులలోకి వెళ్లి వచ్చి స్నానం చేయడానికి నీరు ఉండడం లేదు. కనీసం గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీరు లేదు. తాగునీరు లేక చచ్చిపోయేలా ఉన్నాం. తాగు నీటి కోసం పంచాయతీ ఆఫీసు వద్దకు బిందెలతో వెళ్లవలసి వస్తుంది.

దండం పెడతాను.. తాగునీర్వండి..

కోట సింహాచలం, ఈదటం



కొళాయిలో మంచి నీరు రావడం లేదు. ముసలిదాన్ని నడవలేను. బిందెతో నీరు తెచ్చుకోలేను. అర కిలోమీటరు దూరంలో ఉన్న పంచాయతీ ఆఫీసు వద్ద నుంచి బాటిల్‌తో తాగడానికి మంచినీరు తెచ్చుకుంటున్నాను. దండం పెడతాను.. మంచినీరివ్వండి బాబూ అంటూ వేడుకుంటుంది.

రెండు మూడు రోజులలో నీరందిస్తాం

వరహాలబాబు, పంచాయతీకార్యదర్శి ,ఈదటం

బోర్లలో నీరు అడుగంటిపోవడం వలన సరిపడా నీరు రావడం లేదు. ఒక బోరులో మోటారు కింద పడిపోయింది. దానిని తీయిస్తున్నాం. వాటర్ ట్యాంకు లేకపోవడంతో బోర్లతో డైరక్టుగా పైపులైన్లుకు కలపడం వలన మెరక ప్రాంతాలకు నీరు సరఫరా కావడం లేదు. వాల్వులు వేస్తున్నాం. అదేవిధంగా చేతిబోరును బాగు చేయిస్తున్నాం. రెండు మూడు రోజులలో నీరందేలా చర్యలు తీసుకుంటున్నాం

కూండ్రంలో మరో అగ్నిప్రమాదం

» పాడి పశువులు, ఎండు వరి కుప్పలే లక్ష్యంగా చేసుకున్న గుర్తు తెలియని దుండగులు

» లబోదిబోమంటున్న పాడి రైతులు

» దుండగులను పట్టుకోవడంలో పోలీసులు విఫలం


సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో వరి కుప్ప మంటలు ఆర్పుతున్న దృశ్యం

కొత్తూరు, మే 22 : అనకాపల్లి మండలం కూండ్రం గ్రామంలో వెంకన్నబంధ నుంచి నూకాలమ్మతల్లి గుడి వరకు, హైస్కూలు, చెరకు కాటా ఉన్న పరిసర ప్రాంతాల పూరి పశువుల పాకలు, వరి గడ్డి కుప్పలను రెండు నెలల నుంచి రోజు తప్పి రోజు గుర్తు తెలియని దుండగులు తగులబెడుతున్నారని స్థానిక పాడి రైతులు వాపోతున్నారు. ఈ తతంగమంతా రెండు నెలల నుంచి గ్రామంలో జరుగుతున్నప్పటికీ అగంతకులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని వారు వాపోతున్నారు. తాజాగా బుధవారం తెల్లవారుజామున యలమంచిలి లక్ష్మి అనే రైతుకు చెందిన ఒక గడ్డి వరి కుప్పను తగులబెట్టారు. సోమవారం తెల్లవారుజామున మొగిలి సత్యవతికి చెందిన ఒక పాక, గడ్డివరికుప్ప పూర్తిగా దగ్ధం కాగా ఒక గేదె తీవ్రంగా గాయపడిందని తెలిపారు. ఈ విధంగా ఇప్పటికి 25 సార్లు పాడి పశువులున్న పాకలను టార్గెట్ చేస్తూ పెట్రోల్‌తో వాటిని దగ్ధం చేస్తున్నారని వాపోయారు. ఇప్పటి వరకు ఈ ప్రమాదంలో రెండు పాడి పశువులు తీవ్ర గాయాలతో మృతి చెందాయి. మరో మూడు స్వల్ప గాయాలతో ఉన్నాయి. అదే విధంగా వరి కుప్పలు 10, పాడి పశువులపాకలు 15 అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పాడి పశువుల పాకలను దహనం చేస్తున్న వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

వెంకుపాలెంలో వ్యవసాయ సహాయకులకు శిక్షణ

కొత్తూరు, మే 22 : మండలంలోని వెంకుపాలెంలో వ్యవసాయ సహాయకులకు బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ సంచాలకులు ఎం.రామారావు మాట్లాడుతూ.. రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని కోరారు. 10 కేజీల జనుము విత్తనాలు రూ.880లు కాగా సబ్సిడీ పోనూ రూ.440 మాత్రమే రైతులు చెల్లించాలన్నారు. పది కేజీల జీలుగ బ్యాగు రూ.880కాగా సబ్సిడీ పోగా రూ.440లు, పిల్లిపెసర పూర్తి ధర రూ. 1072లు సబ్సిడీ పోగా రూ.536లు రైతు వాటా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పీబీ.రంగాచారి, ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఎంపీఈవో జానకి పాల్గొన్నారు.

శారదానగర్ 6వ వీధిలో తాగునీటి సమస్య

కొత్తూరు, మే 22 : కొత్తూరు శారదానగర్ 6వ వీధిలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజు నుంచి తాగునీరు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. వేసవి ఎండలతో ప్రజలంతా అల్లాడిపోతుంటే తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి శారదానగర్ 6వ వీధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, మే 22 : మునిసిపాలిటీ పెదపల్లి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలోని కొక్కిరాపల్లి ఫీడర్‌కు సంబంధించి లైన్ నిర్వహణ పనులు చేస్తున్నందున గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ తెలిపారు. కొక్కిరాపల్లి, పెదపల్లి, వ్యవసాయ కనెక్షన్లు రామ్‌నగర్, యర్రవరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అవకాశం ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకూ, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

రామచంద్రపురంలో అందని బీఎస్ఎన్ఎల్ సేవలు

కోటవురట్ల, మే 22: మండలంలోని రామచంద్రపురంలో పది రోజులనుంచి బీఎస్ఎన్ఎల్ సేవలు వినియోగదారులకు అందడం లేదు. దీంతో వారు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రామచంద్రపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పనిచేయకపోవడంతో అల్లుమియాపాలెం, పందూరు, గూడుపులోవ, ములగలలోవ, బంధ, తదితర గ్రామాల్లో సెల్ నెట్‌వర్క్ సేవలు పది రోజుల నుంచి నిలిచిపోయాయి. అధికారులు తక్షణమే స్పందించి బీఎస్ఎన్ఎల్ సేవలు వినియోగంలోకి తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

లెక్కిస్తారు. అనకాపల్లి పరిధిలో 251 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 17 రౌండ్లు పూర్తిగా 14 టేబుళ్లపై లెక్కింపు జరిపి 18వ రౌండ్‌లో 13 పోలింగ్ కేంద్రాలలో నమోదైన ఓట్లను లెక్కించనున్నారు. ఎలమంచిలి పరిధిలో 246 పోలింగ్ కేంద్రాల ఓట్లను 17 రౌండ్లలో పూర్తిస్థాయిలో లెక్కింపు, 18వ రౌండ్‌లో 8 బూత్‌లకు సంబంధించిన ఓట్లు లెక్కించనున్నారు. పాయకరావుపేట పరిధిలోని 292 పోలింగ్ కేంద్రాల ఓట్లను 20 పూర్తిస్థాయి రౌండ్లలో లెక్కించి, 21వ రౌండ్‌లో 12 బూత్‌ల ఓట్లు లెక్కించనున్నారు. అదేవిధంగా నర్సీపట్నం పరిధిలో 262 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓట్లు 14 టేబుల్స్‌పై 18 పూర్తిస్థాయి రౌండ్లు లెక్కించి 19వ రౌండ్‌లో 10 పోలింగ్ బూత్‌ల ఓట్లు లెక్కిస్తారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓట్ల లెక్కింపునకు ఆరు వేర్వేరు గదులను ఏర్పాటు చేశారు. ప్రతి గదిలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు.

అవాంఛనీయ సంఘటనలు జరిగితే కఠిన చర్యలు

» డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్


రేవుపోలవరం గ్రామస్థులతో మాట్లాడుతున్న నర్సీపట్నం డీఎస్పీ మోహన్

ఎస్.రాయవరం, మే 22 : వచ్చే నెల 4వ తేదీన జరగనున్న కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని రేవుపోలవరం, దార్లపూడి తదితర గ్రామాలను సందర్శించిన ఆయన ప్రజలతో మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటలను జరక్కుండా సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ విభీషణరావు ఉన్నారు.

మల్టీపర్పస్ డ్రోన్‌కు పేటెంట్


దుర్గాప్రసాద్

అనకాపల్లి రూరల్, మే 22 : మండలంలోని కొత్తూరు నరసింగరావుపేటలో గతంలో డ్రోన్ తయారుచేసిన అప్పికొండ దుర్గాప్రసాద్‌కు చెన్నైలో పేటెంట్ ఇనిస్టిట్యూట్ అప్రూవల్ ఇచ్చింది. వ్యవసాయరంగానికి ఉపయోగపడేలా ఈ యువకుడు మల్టీపర్పస్ డ్రోన్ తయారుచేసి అందుబాటులోకి తీసుకువచ్చాడు. చిన్న వయసులో డ్రోన్ తయారు చేసి అందరి మన్ననలను పొందిన దుర్గాప్రసాద్ పేటెంట్ పొందడంపై స్థానికులు ప్రశంసిస్తున్నారు.

ఎన్‌రోల్‌మెంట్ అధ్యాపకులు ఇంటింటా ప్రచారం


విద్యార్థినికి బ్రోచర్ అందజేస్తున్న అధ్యాపకులు

కోటవురట్ల, మే 22: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెంపునకు అధ్యాపకులు ఇంటింటికి వెళ్లిప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది టెన్త్ క్లాసు పాస్ అయిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రైవేట్ కాలేజ్‌లకు దీటుగా బోధన చేస్తామని, కళాశాలలో మెరుగైనా మౌలిక సదుపాయలు ఉన్నాయని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది కళాశాలలో ఇంటర్ ఫలితాలలో అనేకమంది విద్యార్థులు మంచి మార్కులు సాధించారని చెబుతున్నారు. ఇందుకు సంబంధించి బ్రోచర్స్‌ను అందజేస్తున్నారు. బుధవారం మండలంలో యండపల్లి, సుంకపూర్, లింగాపురం, తంగేడు గ్రామాల్లో అధ్యాపకులు బృందం ఇంటింటికి తిరిగి విద్యార్థు ఎన్‌రోల్‌మెంట్ పెంపునకు కృషి చేస్తున్నారు.

థియేటర్లు వెలవెల

... 5వ పేజీ తరువాయి

కోసం, పేషన్‌తో మరికొందరు థియేటర్‌లను నడుపుతున్నారు. వారే యజమానులు కావడంతో నష్టాలను భరిస్తూ ఏ సినిమా వచ్చినా ధైర్యంగా రిలీజ్ చేస్తున్నారు. అదే అద్దెకు తీసుకున్న వారు ఈ సాహసం చేయడం లేదు. పాత సినిమాలనే మళ్లీ ప్రదర్శించడం ద్వారా ఆర్థికంగా నష్టపోవడం మినహా ప్రయోజనం లేదని వెనకడుగు వేస్తున్నారు.

రీరిలీజ్‌తో దయనీయం

ఇటీవల రీరిలీజ్ పేరుతో పాత సినిమాలను..అప్పట్లో సూపర్‌హిట్ అయిన సినిమాలను మళ్లీ ప్రదర్శిస్తున్నారు. అభిమాన హీరోల సినిమా కావడంతో ఆ ఒక్క షో చూసేందుకు జనం థియేటర్‌కు వస్తున్నారు. మూడు రోజులు అదే సినిమా ప్రదర్శిస్తే ప్రేక్షకులు కనిపించడం లేదు. ఫలితంగా మరింత నష్టపోతున్నామని యాజమాన్యాలు వాపోతున్నాయి. ఇలంటి హిట్ సినిమాలన్నీ ఇప్పటికే పలుమార్లు టీవీ చానళ్లలో వచ్చేసినవేనని, దీంతో థియేటర్ ఎక్స్‌పీరియన్స్ కోసం ప్రేక్షకులు రావడం లేదంటున్నారు.

టికెట్ ధరలతో బెంబేలు

థియేటర్లలో టికెట్ ధరలు సగటు ప్రేక్షకుడికి భారంగా మారిపోయాయి. గతంలో ఒక్కో థియేటర్‌లో కనీసం నాలుగైదు క్లాసులుండేవి. తక్కువ ధరకు టికెట్ లభిస్తుండడంతో సామాన్య ప్రేక్షకుల ఆదరణ లభించేది. కానీ ప్రస్తుతం అధికశాతం థియేటర్లలో రెండు క్లాసులకే పరిమితమవుతోంది. అదీ ధర ఎక్కువగా ఉండడంతో రోజు కూలీలు, ఇతర సామాన్యులు థియేటర్ వైపు రావడం లేదు. గతంలో మాదిరిగా ఎక్కువ క్లాసులు అందుబాటులోకి వస్తే ఏడాది పొడవునా థియేటర్లు కళకళలాడుతాయని అంచనా వేస్తున్నారు.

ఓటీటీ ప్రభావం

థియేటర్‌కు జనం రాకపోవడానికి ఓటీటీ ప్లాట్‌ఫాంలు కూడా మరో కారణంగా భావిస్తున్నారు. ముఖ్యంగా ఆండ్రాయిడ్ టీవీలు అందుబాటులోకి రావడం, పెద్దపెద్ద టీవీలు కూడా సామాన్యులు భరించే ధరలకు విక్రయిస్తుండడం, హోం థియేటర్ల ప్రభావం..థియేటర్‌లకు జనం దూరమవడానికి కారణమని చెబుతున్నారు. పైగా థియేటర్‌కు వెళ్లే టికెట్ ధరలతో పాటు ఇంటర్‌వెల్‌లో ఖర్చు భారంగా మారుతోందని సగటు ప్రేక్షకుడు వాపోతున్నాడు. ఈ ఏడాది వేసవిలో థియేటర్లన్నీ ఖాళీగా మారడానికి నాలుగు అంశాలు కీలకంగా మారాయని యాజమాన్య ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు, ఐపీఎల్, పెద్ద హీరోల సినిమాలు లేకపోవడం, తీవ్రమైన ఎండల కారణంగా జనం రావడం లేదంటున్నారు. విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చినప్పటికీ ఓటీటీలో చూద్దామనే భావనలో ఉన్నారంటున్నారు.

థియేటర్లు కళ తప్పాయి

- రమణ, మేనేజర్, మెలోడి థియేటర్

వేసవిలో ఎప్పుడూ థియేటర్‌లు కళకళలాడేవి. ఈసారి సార్వత్రిక ఎన్నికలు, పెద్ద హీరోల సినిమాలు లేకపోవడం థియేటర్లు కళ తప్పడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కనీసం ఐదు నుంచి ఏడు శాతం కూడా ఆక్యుపెన్సీ రావడం లేదు. అయినప్పటికీ కొంతమంది థియేటర్‌లు నడుపుతున్నారు. మరికొంతమంది థియేటర్ మరమ్మతులు చేయిస్తుండగా, ఇంకొంతమంది థియేటర్‌లను అమ్మేశారు. పెద్ద హీరోల సినిమాలు విడుదలయ్యేంత వరకు ప్రేక్షకులు థియేటర్లకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

జగనన్న కాలనీలో రోడ్లు తవ్వేశారు

... 5వ పేజీ తరువాయి

ఫిల్లింగ్‌కు వేరొకరికి సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. లేఅవుట్‌ను ఆనుకుని ఉన్న కొండ నుంచి గ్రావెల్ తవ్వి ఒక్కో బేస్‌మెంట్ ఫిల్లింగ్‌కు రూ.1500కు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిసింది. అయితే సబ్ కాంట్రాక్టర్ పని ప్రారంభించిన తరువాత రూ.1500లు గిట్టుబాటు కావడం లేదని ఎక్స్‌కవేటర్లతో కాలనీలోని రోడ్లను తవ్వేసి ఆ గ్రావెల్‌తోనే బేస్‌మెంట్లు ఫిల్లింగ్ చేసేశారు. నెల రోజులుగా ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అంతేకాకుండా బేస్‌మెంట్‌లో మట్టిని కూరకుండానే ఇళ్ల నిర్మాణాలు జరిగిపోతున్నాయని, కట్టిన నిర్మాణాలకు కనీసం వాటరింగ్ కూడా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. బేస్‌మెంట్ల ఫిల్లింగ్‌కు రోడ్లను తవ్వేయడం విచిత్రంగా ఉందని పలువురు అంటున్నారు.

పోలీసు స్టేషన్‌కు 50 స్టాపర్లు 'రాంకో' వితరణ



సీఐ వినోద్‌బాబుకు స్టాపర్లు అందజేస్తున్న రాంకో ప్రతినిధులు

కశింకోట, మే 22 : స్థానిక పోలీసు స్టేషన్‌కు తాళ్లపాలెం రాంకో సిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యం 50 స్టాపర్లు బుధవారం అందజేసింది. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు రూ.3.5లక్షల విలువ చేసే స్టాపర్లను కశింకోట సీఐ వినోద్‌బాబుకు కంపెనీ ప్రతినిధులు వీరపాండ్యన్, ఎం.కళాధర్, హెచ్ఆర్. మేనేజర్ ఎం.యువరాజు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు, వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు ఈ స్టాపర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు, రైటర్ సూర్యారావు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కశింకోట,మే 22 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం జరగనుందని ఎంపీడీవో కె.శేషుబాబు తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా రాజా రామ్మోహన్‌రాయ్ జయంతి


రాజా రామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కశింకోట, మే 22 : మండలంలోని గొబ్బూరులో అభ్యుదయవాది రాజారామ్మోహన్‌రాయ్ జయంతి బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాజా రామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజారామ్మోహన్‌రాయ్ సతీసహగమనం, సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి కృషి చేశారన్నారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అచ్చెర్ల అధ్యక్షుడు నైనంశెట్టి రమణారావు, టీడీపీ నాయకులు గొంతిన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు త్రిపురాంతకస్వామి, సర్వమంగళాంబ కల్యాణం

కశింకోట, మే 22 : స్థానిక పెద్దబజారు శివాలయంలో త్రిపురాంతక స్వామి, సర్వమంగళాంబ అమ్మవార్ల 108వ కల్యాణం గురువారం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు వెలవలపల్లి బాబ్జీ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చన, అలంకరణ, అర్చనలు నిర్వహించనున్నామని చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి 108 మంది దంపతులతో స్వామి అమ్మవార్ల కల్యాణం ఉంటుందని తెలిపారు. కల్యాణంలో పాల్గొనదలచే దంపతులు ఆలయం వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

పరవాడ, మే 22 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జీవీ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఒక్కొక్క గ్రూపులో 88 సీట్లు ఉన్నాయని, తెలుగు, ఆంగ్ల మధ్యమాల్లో బోధన ఉంటుందన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ప్రవేశాల సమయంలో ఫీజు రూ.2,209, సీఈసీ, హెచ్ఈసీ విద్యార్థులు రూ.1,309 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పదో తరగతిలో 550 మార్కులు దాటిన విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వీరికి ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తామని, ఆ ఫీజును రామ్‌దాస్ ఫౌండేషన్ చెల్లిస్తుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో కళాశాలకు వచ్చి ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ నారాయణరావు సూచించారు.

'ఉపాధి కూలి రూ.300 ఇవ్వాలి'


సమావేశంలో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం, మే 22: ఉపాధి హామీ కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి రూ.300 ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. బుధవారం హరిపాలెం, పెదపాడుల్లో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు రూ.300 కూలి ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా వాస్తవానికి రావడం లేదన్నారు. అందువల్ల ఏ రోజు ఎంత వేతనం పడుతుందో తెలుసుకునే విధంగా పే స్లిప్‌లు ఇవ్వాలన్నారు. ఎండ వేడికి ప్రభుత్వం ఉపాధి కూలీలకు, టెంట్లు ఏర్పాటు చేసి మజ్జిగ, మంచినీరు, 30 శాతం వేసవి అలవెన్స్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శంకరరావు, వేంకటరత్నం, మంగ, రామలక్ష్మి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

రాంబిల్లి, మే 22 : ఖరీఫ్‌కు పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత తెలిపారు. జీలుగ, జనుము,పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను రైతుల కోసం సిద్ధం చేశామన్నారు. ఎకరాకు 10 కేజీలు చొప్పున పచ్చిరొట్ట విత్తనాలను చల్లి సాగు చేసిన పంటను పూత దశలో భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరగడమే కాకుండా నత్రజని ఎరువు సహజసిద్ధంగా మొక్కలకు అందుతుందన్నారు. 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్నట్టు ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం, మే 22: విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలు క్లియరెన్స్ చేస్తున్నందున మంగళవారం కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రామన్నపాలెం, చీమలాపల్లి, అవసోమవరం, ఆవరాజాం, నారపాక, అచ్యుతాపురం, మోసయ్యపేట, మడుతూరు సెంటర్, సానికాలువ, జేపీ అగ్రహారం, బంగారయ్యపాలెం, అప్పన్న పాలెం, ఎరకన్నపాలెం, తట్టవానిపాలెం, దొప్పెర్ల, ఇరువాడ, చిట్టిబోయినపాలెం, నడింపల్లి గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

క్రీడాకారుడిని అభినందించిన ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్, మే 22: చైనాలో జరిగే వరల్డ్ బీచ్ పారా ఒలింపిక్స్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన ఎస్.రాయవరం మండలం సోమిదేవిపల్లికి చెందిన దివ్యాంగ క్రీడాకారుడు అన్నం గణేష్‌ను ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి బుధవారం తన కార్యాలయంలో సత్కరించారు. చైనాలో జరిగే పోటీల్లో విజయం సాధించి జిల్లా కీర్తి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాండ్రేగుల యశ్వంత్, ఎస్.రాయవరం మండలం వైసీపీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వలసలు నివారించండి


ఎర్రవరంలో కూలీలతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గొలుగొండ, మే 22: ఉపాధి కోసం కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలసలను నివారించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఎర్రవరంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో పనులు కల్పించకపోవడంతో ఇతర ప్రాంతాలకు పనుల కోసం కూలీలు వలస వెళ్లిపోతున్నారన్నారు. రానున్న రోజుల్లో ఉపాధి హామీ రోజు కూలి రూ.600లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొండలరావు, కిల్లాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.,

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మాణం


లయన్స్ క్లబ్ నిర్మించిన మరుగుదొడ్లు

నర్సీపట్నం, మే 22 : సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు మరుగుదొడ్లను నిర్మించారు. బుధవారం లయన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, నవ్య లయన్స్ క్లబ్ సభ్యులు వెలగా నారాయణరావు ఆర్డీవో జయరాంని కలిసి మరుగుదొడ్ల తాళాలు అందజేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో పాతది ఒక మరుగుదొడ్డి ఉండగా, అదనంగా మరొకటి నిర్మాణం చేశారు. పాతదానికి మరమ్మతులు చేయించారు. రూ.లక్ష పైగా ఖర్చు చేసినట్టు వారు తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


జోగంపేట ఆర్‌బీకేలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గొలుగొండ, మే 22: జోగంపేట ఆర్‌బీకేలో పచ్చిరొట్ట విత్తనాలను మండల వ్యవసాయాధికారిణి సుధారాణి బుధవారం పంపిణీ చేశారు. జీలుగ, జనుము కిలో విత్తనాలు రూ.88 కాగా 50శాతం రాయితీ పోను రూ.44కు రైతులకు అందిస్తున్నట్టు ఆమె తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులను రైతులు పొలాల్లో వరి నాట్లకు ముందుగా చల్లాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది సత్య, రైతులు పాల్గొన్నారు.

తుప్పలతో దర్శనమిస్తున్న జగనన్న కాలనీ స్థలం


జెడ్.గంగవరం జగనన్న కాలనీకి కేటాయించిన స్థలం ఇదే

మాకవరపాలెం, మే 22: మండలంలో జెడ్.గంగవరంలో జగనన్న కాలనీ తుప్పలతో దర్శనమిస్తున్నది. రెండేళ్ల క్రితం అర్హులను గుర్తించి ఇచ్చిన ఇంటి స్థలాల్లో నేటికీ పనులు ప్రారంభించలేదు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని కొండప్రాంతంలో ఇంటి స్థలాలు ఇవ్వడంతో నిర్మాణాలు చేపట్టలేదని లబ్ధిదారులు చెబుతున్నారు. అయితే గ్రామానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు జగనన్న ఇంటి పట్టాలు మంజూరు చేశారు. అనంతరం నిర్మాణాలు చేపట్టలేదని కొద్ది రోజులు తర్వాత ఇంటి పట్టాలు వెనక్కి తీసుకున్నారని వారు చెబుతున్నారు. అయితే వలంటీర్లు ఇంటింటికి మంజూరు చేసిన వైసీపీ కరపత్రాల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు చూపించారని వారు తెలిపారు. పట్టాలు వెనక్కి తీసుకొని స్థలాలు ఇచ్చినట్లు ఎలా చెబుతారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇంటి పట్టాలైనా ఇవ్వాలని లేకుంటే జాబితాల నుంచి పేర్లు తొలగించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

- రామచంద్రపురంలో ప్రభుత్వ స్థలం, శ్మశాన వాటికల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

కృష్ణాదేవిపేట, మే 22: గొలుగొండ మండలం లింగంపేట పంచాయతీ శివారు రామచంద్రపురం గ్రామ శ్మశాన వాటిక, ప్రభుత్వ స్థలంలో బుధవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈనెల 20వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'రామచంద్రపురంలో శ్మశాన వాటిక స్థలం కబ్జాకు యత్నం' శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం గొలుగొండ తహసీల్దార్ ప్రభాకర్‌రాజు ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌భరత్, మల్లంపేట వీఆర్‌వో కె. సన్యాసిరావు ఆ స్థలాల్లో ట్రాక్టర్‌తో ఎవరు దున్నారన్న వివరాలు సేకరించారు. అనంతరం హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో చెరువులు, శ్మశాన వాటిక ఇతర ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే ఫిర్యాదు చేయాలని ప్రజలను ఆయన కోరారు.


శ్మశాన వాటికలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఎండతో రోడ్లు నిర్మానుష్యం


జన సంచారం లేని కృష్ణాదేవిపేట రహదారి

కృష్ణాదేవిపేట, మే 22: భానుడు ఉగ్రరూపంతో రోడ్లు నిర్మానుష్యమవుతున్నాయి. బుధవారం కాసిన ఎండకు ప్రజలు బయటకు రావడానికి భయపడ్డారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, ఏఎల్‌పురం, లింగంపేట తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే కృష్ణాదేవిపేట రోడ్డు కూడా బోసిపోయింది.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం అర్బన్: మండలంలో గత రెండు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఎండల తీవ్రతకు నిత్యం రద్దీగా వుండే ప్రధాన రహదారుల్లో జనసంచారం లేకపోవడంతో బోసిపోయాయి. చెట్టుపల్లి, ఓఎల్.పురం, గరండొరపాలెం, ధర్మసాగరం, కేఎల్.పురం, గబ్బాడ, నీలంపేట, వేములపూడి, అమలాపురం, దుగ్గాడల్లో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎండల తీవ్రతతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఉక్కపోతతో ప్రజలు, చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోయారు.

నెలలు గడుస్తున్నా ముందుకు సాగని జలజీవన్ పనులు

మాకవరపాలెం, మే 22: నెలలు గడుస్తున్నా మండల కేంద్రంలో జలజీవన్ మిషన్ పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన మాకవరపాలెంలో ఏడాది క్రితం సుమారు కోటి రూపాయలతో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించారు. బాగున్న సిమెంటు రోడ్లు తవ్వి జలజీవన్‌మిషన్ పైపు లైన్లు చేపట్టారు. చివరకు కొళాయి పైపులు వేసి వృథాగా వదిలి వేశారు. ఇప్పటికీ నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడ వేసిన చందాన ఉంది. దీంతో ఉన్న కొళాయిల పైపులు కొన్నిచోట్ల మరమ్మతులకు గురై తాగునీటి సరఫరా నిలిచిపోతున్నదని స్థానికులు అంటున్నారు. జలజీవన్ మిషన్ పనుల వల్ల కొత్త వీధి, బీసీ కాలనీ, పైకోలనీ వీధిల్లో చాల చోట్ల తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

జగనన్న కాలనీలో రోడ్లు తవ్వేశారు

... 5వ పేజీ తరువాయి

ఫిల్లింగ్‌కు వేరొకరికి సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. లేఅవుట్‌ను ఆనుకుని ఉన్న కొండ నుంచి గ్రావెల్ తవ్వి ఒక్కో బేస్‌మెంట్ ఫిల్లింగ్‌కు రూ.1500కు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిసింది. అయితే సబ్ కాంట్రాక్టర్ పని ప్రారంభించిన తరువాత రూ.1500లు గిట్టుబాటు కావడం లేదని ఎక్స్‌కవేటర్లతో కాలనీలోని రోడ్లను తవ్వేసి ఆ గ్రావెల్‌తోనే బేస్‌మెంట్లు ఫిల్లింగ్ చేసేశారు. నెల రోజులుగా ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అంతే కాకుండా బేస్‌మెంట్‌లో మట్టిని కూరకుండానే ఇళ్ల నిర్మాణాలు జరిగిపోతున్నాయని, కట్టిన నిర్మాణాలకు కనీసం వాటరింగ్ కూడా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. బేస్‌మెంట్ల ఫిల్లింగ్‌కు రోడ్లను తవ్వేయడం విచిత్రంగా ఉందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి లేఅవుట్ రోడ్లను తవ్వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

లెక్కిస్తారు. అనకాపల్లి పరిధిలో 251 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 17 రౌండ్లు పూర్తిగా 14 టేబుళ్లపై లెక్కింపు జరిపి 18వ రౌండ్‌లో 13 పోలింగ్ కేంద్రాలలో నమోదైన ఓట్లను లెక్కించనున్నారు. ఎలమంచిలి పరిధిలో 246 పోలింగ్ కేంద్రాల ఓట్లను 17 రౌండ్లలో పూర్తిస్థాయిలో లెక్కింపు, 18వ రౌండ్‌లో 8 బూత్‌లకు సంబంధించిన ఓట్లు లెక్కించనున్నారు. పాయకరావుపేట పరిధిలోని 292 పోలింగ్ కేంద్రాల ఓట్లను 20 పూర్తిస్థాయి రౌండ్లలో లెక్కించి, 21వ రౌండ్‌లో 12 బూత్‌ల ఓట్లు లెక్కించనున్నారు. అదేవిధంగా నర్సీపట్నం పరిధిలో 262 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓట్లు 14 టేబుల్స్‌పై 18 పూర్తిస్థాయి రౌండ్లు లెక్కించి 19వ రౌండ్‌లో 10 పోలింగ్ బూత్‌ల ఓట్లు లెక్కిస్తారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓట్ల లెక్కింపునకు ఆరు వేర్వేరు గదులను ఏర్పాటు చేశారు. ప్రతి గదిలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు.

థియేటర్లు వెలవెల

... 5వ పేజీ తరువాయి

కోసం, పేషన్‌తో మరికొందరు థియేటర్‌లను నడుపుతున్నారు. వారే యజమానులు కావడంతో నష్టాలను భరిస్తూ ఏ సినిమా వచ్చినా ధైర్యంగా రిలీజ్ చేస్తున్నారు. అదే అద్దెకు తీసుకున్న వారు ఈ సాహసం చేయడం లేదు. పాత సినిమాలనే మళ్లీ ప్రదర్శించడం ద్వారా ఆర్థికంగా నష్టపోవడం మినహా ప్రయోజనం లేదని వెనకడుగు వేస్తున్నారు.

రీరిలీజ్‌తో దయనీయం

ఇటీవల రీరిలీజ్ పేరుతో పాత సినిమాలను..అప్పట్లో సూపర్‌హిట్ అయిన సినిమాలను మళ్లీ ప్రదర్శిస్తున్నారు. అభిమాన హీరోల సినిమా కావడంతో ఆ ఒక్క షో చూసేందుకు జనం థియేటర్‌కు వస్తున్నారు. మూడు రోజులు అదే సినిమా ప్రదర్శిస్తే ప్రేక్షకులు కనిపించడం లేదు. ఫలితంగా మరింత నష్టపోతున్నామని యాజమాన్యాలు వాపోతున్నాయి. ఇలంటి హిట్ సినిమాలన్నీ ఇప్పటికే పలుమార్లు టీవీ చానళ్లలో వచ్చేసినవేనని, దీంతో థియేటర్ ఎక్స్‌పీరియన్స్ కోసం ప్రేక్షకులు రావడం లేదంటున్నారు.

టికెట్ ధరలతో బెంబేలు

థియేటర్లలో టికెట్ ధరలు సగటు ప్రేక్షకుడికి భారంగా మారిపోయాయి. గతంలో ఒక్కో థియేటర్‌లో కనీసం నాలుగైదు క్లాసులుండేవి. తక్కువ ధరకు టికెట్ లభిస్తుండడంతో సామాన్య ప్రేక్షకుల ఆదరణ లభించేది. కానీ ప్రస్తుతం అధికశాతం థియేటర్లలో రెండు క్లాసులకే పరిమితమవుతోంది. అదీ ధర ఎక్కువగా ఉండడంతో రోజు కూలీలు, ఇతర సామాన్యులు థియేటర్ వైపు రావడం లేదు. గతంలో మాదిరిగా ఎక్కువ క్లాసులు అందుబాటులోకి వస్తే ఏడాది పొడవునా థియేటర్లు కళకళలాడుతాయని అంచనా వేస్తున్నారు.

ఓటీటీ ప్రభావం

థియేటర్‌కు జనం రాకపోవడానికి ఓటీటీ ప్లాట్‌ఫాంలు కూడా మరో కారణంగా భావిస్తున్నారు. ముఖ్యంగా ఆండ్రాయిడ్ టీవీలు అందుబాటులోకి రావడం, పెద్దపెద్ద టీవీలు కూడా సామాన్యులు భరించే ధరలకు విక్రయిస్తుండడం, హోం థియేటర్ల ప్రభావం...థియేటర్‌లకు జనం దూరమవడానికి కారణమని చెబుతున్నారు. పైగా థియేటర్‌కు వెళ్లే టికెట్ ధరలతో పాటు ఇంటర్‌వెల్‌లో ఖర్చు భారంగా మారుతోందని సగటు ప్రేక్షకుడు వాపోతున్నాడు. ఈ ఏడాది వేసవిలో థియేటర్లన్నీ ఖాళీగా మారడానికి నాలుగు అంశాలు కీలకంగా మారాయని యాజమాన్య ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు, ఐపీఎల్, పెద్ద హీరోల సినిమాలు లేకపోవడం, తీవ్రమైన ఎండల కారణంగా జనం రావడం లేదంటున్నారు. విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చినప్పటికీ చాలామంది ఓటీటీలో చూద్దామనే భావనలో ఉన్నారంటున్నారు.

థియేటర్లు కళ తప్పాయి

- రమణ, మేనేజర్, మెలోడి థియేటర్

వేసవిలో ఎప్పుడూ థియేటర్‌లు కళకళలాడేవి. ఈసారి సార్వత్రిక ఎన్నికలు, పెద్ద హీరోల సినిమాలు లేకపోవడం థియేటర్లు కళ తప్పడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కనీసం ఐదు నుంచి ఏడు శాతం కూడా ఆక్యుపెన్సీ రావడం లేదు. అయినప్పటికీ కొంత మంది థియేటర్‌లు నడుపుతున్నారు. మరికొంతమంది థియేటర్ మరమ్మతులు చేయిస్తుండగా, ఇంకొంతమంది థియేటర్‌లను అమ్మేశారు. పెద్ద హీరోల సినిమాలు విడుదలయ్యేంత వరకు ప్రేక్షకులు థియేటర్లకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

రికార్డులు లేని వాహనాలు సీజ్


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

రావికమతం, మే 22: మండలంలోని కొత్తకోట గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్‌లో భాగంగా ప్రతి ఇంటిని పరిశీలించి రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మణరావుతోపాటు సర్కిల్ పరిధిలో పోలీసు సిబ్బంది బుధవారం తెల్లవారు జాము నుంచి ప్రధాన కూడళ్ళు, గ్రామ శివార్లలో వాహనాలను విస్తృత తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని 72 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, ఒక వ్యాన్, కారు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ, వాహన చోరీలు నివారణకు ఇటువంటి తనిఖీలు చేపతామన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులు స్టేషన్‌కు వచ్చి సరైన రికార్డులు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ తనిఖీల్లో కొత్తకోట,రావికమతం , రోలుగుంట,బుచ్చియ్యపేట ఎస్‌ఐలు లక్ష్మణరావు, .ధనుంజయనాయుడు, సురేష్, ఈశ్వరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

చీడికాడ, మే 22: జి.కొత్తపల్లి కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థినులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ విభారతి కోరారు. తమ పాఠశాలలో ఎంపీసీలో మొదటి సంవత్సరంలో చేరేందుకు 40 సీట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. విద్యార్థినుల ఆధార్‌కార్డు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, పదో తరగతి మార్కుల కాపీ, పాస్‌ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్‌తో ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తులను పాఠశాల కార్యాలయంలో అందించాలని ఆమె కోరారు. మార్కులు, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.సీటు పొందినవారికి ఉచిత విద్య, వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని ఆమె తెలిపారు. వివరాలకు ఫోన్: 9490777506 సంప్రదించాలని ఆమె కోరారు.


గంజాయి కేసుల్లో పట్టుబడిన వాహనాలు


గుట్టలుగా పేరుకుపోతున్న వాహనాలు

సీజ్ చేసిన వాహనాలకు నిర్లక్ష్యం తుప్పు

- మాడుగుల ఎక్సైజ్ కార్యాలయం వద్ద స్థల సమస్య
- పేరుకుపోతున్న గంజాయి, మద్యం కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు

మాడుగుల రూరల్, మే 22: మాడుగుల ఎక్సైజ్ కార్యాలయం (ప్రస్తుతం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) కార్యాలయం)లో పలు గంజాయి, లిక్కర్ కేసుల్లో పట్టుబడిన వాహనాలు పేరుకుపోతున్నాయి. ఇక్కడి కార్యాలయానికి సొంత భవనం లేదు. చాలారోజులుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ భవనం ఎదురుగా ఉండే ఖాళీ ప్రదేశంలో కొన్నేళ్లుగా గంజాయితో పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి ఉంచేవారు. బైక్‌లను కార్యాలయ ఆవరణ లోను, వ్యాన్‌లు, కార్లు, జీపులు ఆటోలు ఇలా పలు వాటిని ఎదురుగా ఉన్న ప్రదేశంలో పెడుతూ ఉండేవారు. అయితే, ఆ ఖాళీ ప్రదేశం ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించింది. దీంతో వ్యక్తుల కోరికపై వాహనాలను రెండేళ్ల కిందట అక్కడ నుంచి మరో చోట పెట్టారు. కాగా, ఇటీవల సుమారు ఏడాది కిందట కార్యాలయానికి దూరంగా ఇవన్నీ ఉన్నాయి. స్థల సమస్య కారణంగా ఒక వాహనంపై మరో వాహనం పెట్టి గుట్టగా పేర్చారు. అక్కడితో ఆ వాహనాలపై పర్యవేక్షణ కరువవ్వడంతో భద్రత కరువైంది. టైర్లు పలు విడి భాగాలు గుర్తుతెలియని వ్యక్తులుఎత్తుకుపోతున్నారు. ఎండా, వానలకు ఈ వాహనాలు తుప్పు పట్టిపోతున్నాయి.

సుమారు 120 వాహనాలు ఉన్నట్టు సిబ్బంది చెబుతున్నారు. తగినంత స్థల సమస్య కారణంగా ఆ వాహనాలకు భద్రత కరువవుతున్నట్టు తెలిపారు. ఎంతో విలువైన వాహనాలు ఇలా వృథాగా పోవడంతో అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్టు ఆరోపణలువినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఏది ఏమైనా ఈ వాహనాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తొమ్మిది, పదో తరగతుల పాఠ్య పుస్తకాలు సరఫరా


పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు

కె.కోటపాడు, మే 22: ప్రస్తుత విద్యా సంవత్సరానికి ప్రభుత్వ స్కూళ్లలోని తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు పంపిణీకి పాఠ్య పుస్తకాలు బుధవారం మండలానికి చేరాయి. మారిన సిలబస్ మేరకు అన్ని పుస్తకాలు ముందుగానే వచ్చినట్టు ఎంఈవో కె. సత్యనారాయణ తెలిపారు. పాఠశాలలు తెరిచిన వెంటనే వీటిని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. మండల పరిధిలో ఏడు జడ్పీ హైస్కూల్స్, ఒక కేజీబీవీలోని ఒక్కో పదవ తరగతి విద్యార్థికి 11 పుస్తకాలు చొప్పున అందిస్తామన్నారు. ఈ పాఠ్యపుస్తకాలను సమగ్రశిక్ష సీఎంవో బి. శకుంతల పరిశీలించారు. అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం డివిజన్లో అన్ని మండలాలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయనున్నట్టు ఆమె విలేకరులకు తెలిపారు. బుధ, గురువారాల్లో సబ్బవరం, కె. కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగులఎంఈవోలకు పుస్తకాలను అందజేయనున్నట్టు చెప్పారు. ముందుగానే పుస్తకాలు చేరడంతో విద్యార్థులకు సక్రమంగా సరఫరా చేయాలని ఆదేశించారు.ఆమె వెంట ఎంఈవో-2 డీవీఈడీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నేడు ఐతంపూడిలో మరిడితల్లి పండుగ


అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం.

బుచ్చెయ్యపేట, మే 22: ఐతంపూడిలో మరిడితల్లి ప్రధాన పండగ గురువారం నిర్వహించనున్నారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ పండగ ఐదు రోజులపాటు కొనసాగించడం ఆచారం. దీనిలో భాగంగా ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. రోజూ అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగిస్తున్నారు. ఆఖరిరోజు గురువారం భారీ ఏర్పాట్లను ఉత్సవ కమిటీ చేపట్టింది.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన


చింతలపూడి కొత్తూరులో నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, మే 22: మండలంలోని చింతలపూడి శివారు కొత్తూరులో తాగునీటి సమస్యపై గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో బుధవారం నిరసన తెలిపారు. ఆ గ్రామంలో ఉన్న రెండు కొళాయిల్లో ఒకటి పాడవడంతో గ్రామ మంతా ఉన్న ఒక్కదానిపైనే ఆధారపడడంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.

పరుగుల బామ్మ లక్ష్మికి సత్కారం


వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

చోడవరం, మే 22: వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పరుగులబామ్మగా గుర్తింపు తెచ్చిన వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మిని స్థానిక వికాస్ యోగా కేంద్రం విద్యార్థులు బుధవారం ఘనంగా సత్కరించారు. యోగాగురువు ఆర్రెపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముత్యం లక్ష్మిని సత్కరించిన విద్యార్థులు ఆమె సాధించిన విజయాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోవాడ షుగర్స్ రిటైర్డ్ ఏవో పప్పల రమణమూర్తి, యోగా విద్యార్థులు అడపా భూలక్ష్మి, రామకోటి, గిరి, గోపాలరావు, రత్నశ్రీ, పద్మావతి, రాధ, రాధిక, శిరీష, అనూరాధ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో ఎస్సీ, ఎస్టీలు శతశాతం పాల్గొవాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

చీడికాడ, మే 22: జాతీయ ఉపాధి పథకం పనులలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన వేతనదారులు శతశాతం పాల్గొనేలా చూడాలని ఎంపీడీవో జె. ఉమామహేశ్వరి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పథకం వీఆర్పీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధి పనులకు అన్ని వర్గాలు వస్తున్నా, ఎస్సీ ఎస్టీ కుటుంబాలు తక్కువగా ఉంటున్నాయన్నారు. వీరు శతశాతం వచ్చే లా కృషిచేయాలని కోరారు. అలాగే అన్ని పంచాయతీల్లో రూ.292 సరాసరి వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో సియ్యాద్రి నాగరాజు, ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు బిఎస్.పాత్రుడు, కె.ఎర్రునాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు


వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారి

దేవరాపల్లి, మే 22: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథాలయ అధికారి ఓ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 13 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు 144 సెక్షన్ : సీఐ


బుచ్చెయ్యపేటలో మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

బుచ్చెయ్యపేట, మే 22: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కొత్తకోట సీఐ అప్పలనాయుడు తెలిపారు. బుధవారం బుచ్చెయ్యపేటలో స్థానికులకు ఎన్నికల ఆంక్షలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో నలుగురు కంటే ఎక్కువ మంది గుమికూడి ఉండరాదన్నారు. కౌటింగ్ రోజున ప్రదర్శనలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ఆంక్షలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.సమావేశంలో బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

మాడుగుల: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ దామోదరనాయుడు హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో జరిగి పోలింగ్ ఓట్ల లెక్కింపు అయ్యేంత వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు. నలుగురికంటే ఎక్కువ జనం గుమిగూడి ఉన్నా, పండగల పే రుతో కార్యక్రమాలను నిర్వహించినా కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. గ్రామాల్లో పండగలు, ఊరేగింపులు, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ ప్రోగ్రామ్స్ వంటివి నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారుల ఆదేశాలున్నాయన్నారు. అలాగే పార్టీలు గెలుపు, ఓటమిలపై బెట్టింగ్‌లు కాస్తున్నట్టు సమాచారం ఉందని, వీటిపై కూడా నిఘా పెట్టామన్నారు. జూన్ 4వ తేదీన విజయోత్సవ ర్యాలీలు, బాణ సంచాలతో హడావుడి చేయరాదని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రతీ ఒక్కరూ వ్యవహరించాలన్నారు. స్థానిక పోలీసులతో పాటు ప్రతీ గ్రామంలో నిఘా టీంలు తిరుగుతున్నాయని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.